సాక్షి
వికారాబాద్
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



ఎన్నికలు కలేనా?

పదిహేను సంవత్సరాలుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. 8లో▸



ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే..

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వికారాబాద్–కృష్ణ రైల్వే లైన్ ఆలస్యం అవుతోందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



లక్షలు వెచ్చించి.. వదిలేశారు

పెద్దేముల్‌లో జెడ్పీ నిధులు రూ. 20లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

వర్షంలోనూ నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

వికారాబాద్ అర్బన్: విద్యాశాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న రెడ్డి కోరారు. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సోమవారం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయమైన హక్కుల కోసం తాము పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. జిల్లాలో 650 మంది కాంట్రాక్టు ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రత కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించండి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, బీఎల్‌ఓలు

కొడంగల్: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని అదనపు కలెక్టర్, కొడంగల్ ఎన్నికల అధికారి లింగ్యా నాయక్ బీఎల్‌ఓలకు సూచించారు. సోమవారం ఆయన బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున బూత్‌లెవల్ అధికారులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటు హక్కు పొందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

పార్టీ మైనార్టీ విభాగం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా పాషా



నియామక పత్రం అందుకుంటున్న పాషా

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ హాజీ పాషాను నియమించారు. సోమవారం మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, మండల కో ఆప్షన్ సభ్యులు ఎర్రవల్లి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు అవకాశం కల్పించండి

మంత్రి మహేందర్‌రెడ్డి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

తాండూరు రూరల్: పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. తాండూరు మండలం మల్కాపూర్ శివారులోని ది ఇండియా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు సోమవారం నగరంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రమేశ్, దక్షిణామూర్తి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



నవాబుపేట మండలంలో నీట మునిగిన పంటలు

వాగులు ఉగ్రరూపం

జిల్లాలో భారీ వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండిన చెరువులు, ప్రాజెక్టులు
- కొట్టుకుపోయిన రోడ్లు
- పలు చోట్ల రాకపోకలకు అంతరాయం
- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష

వికారాబాద్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. చాలాచోట్ల చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. జిల్లాలో 1,179 చెరువులు, కుంటలు ఉండగా అన్ని నీటితో కళకళలాడుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి.

అప్రమత్తమైన అధికారులు

వర్షాల పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి కిందిస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో 26 చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం ఆయా వాగులు, బ్రిడ్జీల వద్ద నిఘా ఉంచారు. ధారూరు మండలం కోట్‌పల్లి, పరిగి మండలం లఖ్నాపూర్, యాలాల్ మండలం జుంటుపల్లి, శివసాగర్, వికారాబాద్ మండలం శివారెడ్డిపేట్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులు అలుగు పారుతున్నాయి. కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, రైతులు, పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ధారూరు మండలం దోర్నాల, పరిగి, దన్నారం మార్గాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జీలపై రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

అప్రమత్తంగా ఉండాలి



వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు, వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్

డయల్ 100కు కాల్ చేయండి



వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ప్రజలు డయల్ 100కు కాల్ చేయాలి. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రజలు, రైతులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ

ఆదిలోనే హంసపాదు



- ఏడాదిన్నర క్రితం ఆర్భాటంగా పశువుల పంపిణీ పథకం
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం
- ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షలు
- 70శాతం రాయితీ, 30శాతం రుణంతో రెండు పాడి పశువులు
- ఎస్సీ సబ్‌ప్లాన్ కింద అమలు
- పైలెట్ ప్రాజెక్టు కింద ఆరు మండలాలు, ఒక మున్సిపాలిటీల ఎంపిక

వికారాబాద్: పాడి పశువుల పంపిణీ పథకం ప్రారంభించకుండానే అటకెక్కిందనే అపవాదు మూటగట్టుకుంది. ఎస్సీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2021 అక్టోబర్‌లో ప్రభుత్వం పాడి పశువుల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా ఒక్కో ఎస్సీ కుటుంబానికి 70శాతం రాయితీతో రెండు పాడి పశువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా 2021 –22 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, అలాగే చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ ఆరు మండలాల్లో పాల సేకరణకు అనువైన గ్రామాలను విజయ డెయిరీ ద్వారా గుర్తించారు. పథకం పొందిన వారు విజయ డెయిరీకే పాలు విక్రయించేలా నిబంధనలు విధించారు. పాడి రైతును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం లీటరు పాలకు రూ. 4 అదనంగా ఇచ్చేలా ప్లాన్ చేశారు. అయితే పథకం ప్రారంభమై ఏడాదిన్నర దాటినా ఒక్క యూనిట్ కూడా మంజూరు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి విడతలో 255 యూనిట్లు

జిల్లాకు మొదటి విడతలో 255 యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. ఒక్కో యూనిట్ ధర రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. ప్రభుత్వ రాయితీ 70శాతం (రూ 1.40లక్షలు) మరో 30 శాతం నిధులు రూ. 60వేలు బ్యాంకుల ద్వారా రుణం రూపంలో ఇవ్వనున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 215 యూనిట్లు, నవాబుపేట మండలంలో 40 యూనిట్లు అమలు చేయాలని నిర్ణయించారు. ఒక్కో యూనిట్ కింద రెండు పాడి పశువులు ఇవ్వాలని భావించారు. ఈ పథకానికి జిల్లాలో రూ. 5.10 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. 70 శాతం రాయితీ రూ. 4.08 కోట్లను ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. మిగతా 30 శాతం నిధులు అంటే రూ. 1.02 కోట్లు బ్యాంకుల ద్వారా రుణం రూపంలో ఇప్పించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. కానీ పథకం మాత్రం అమలుకు నోచుకోలేదు.

ఎంపికైన గ్రామాలు ఇవే..

- వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని సిద్దులూరు, పీరంపల్లి, పులుసుమామిడి, గొట్టిముక్ల, సర్పన్‌పల్లి, మైలార్‌దేవరంపల్లి, పీలారం, బురాన్‌పల్లి గ్రామాలను ఎంపిక చేశారు.
- మండల కేంద్రమైన మర్పల్లితోపాటు బూచన్‌పల్లి, రావులపల్లి, పట్లూరు, సిరిపురం గ్రామాలను ఎంపిక చేశారు.
- బంట్వారం మండల కేంద్రంతోపాటు రొంపల్లి, మంగ్రాస్పల్లి, నాగవరం గ్రామాలు ఈ జాబితాలో ఉన్నాయి.
- కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు బార్వాద్, కరీంపూర్, మోత్కుపల్లి, జిన్నారం, బీరోల్ గ్రామాలను ఎంపిక చేశారు.
- ధారూరు మండల కేంద్రంతో పాటు రుద్రారం, గట్టెపల్లి, కుక్కింద, అల్లీపూర్, హరిదాస్‌పల్లి, నర్సాపూర్, కెరవెల్లి, ఎబ్బనూరు, మున్నూరుసోమారం, తరిగోపుల, మైలారం, నాగారం, కుమ్మరిపల్లి, మోమిన్‌కలాన్, నాగసముందర్, రాజాపూర్, గురుదొట్ల, అంపల్లి గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేశారు.
- మోమిన్‌పేట్ మండలం బాల్‌రెడ్డిగూడ, చీమల్‌దరి, చక్రంపల్లి, దేవరంపల్లి, ఎన్కెతల, గ్రామాలను ఎంపిక చేశారు.
- నవాబుపేట మండలంలోని ఆర్కతల, చించల్‌పేట్, మీనపల్లి కలాన్, యావాపూర్ గ్రామలను ఈ పథకం కింద ఎంపిక చేశారు.

నిధులు మంజూరైతే అమలు చేస్తాం



వన్ ప్లస్ వన్ పాడి పశువుల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. అయితే ఈ పథకానికి సంబంధించి ఇంకా నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వ అనుమతులు రాగానే పథకాన్ని అమలు చేస్తాం

– బాబుమోజెస్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్

రైతులకు పంట రుణాలివ్వండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లాలో 1,48,732 మంది రైతులకు రూ. 808.54 కోట్ల రుణమాఫీ

వికారాబాద్ అర్బన్: పంటల సాగు కోసం రైతులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినందున బ్యాంకర్లు వారికి తిరిగి రుణాలు ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం మంత్రులు, సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,48,732 మంది రైతులకు రూ. 808.54 కోట్ల రుణమాఫీ వర్తింపజేసినట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో ముందుగా లక్షా పదివేల రూపాయల లోపు పంట రుణాలు కలిగి ఉన్న వారికి రుణమాఫీ అమలు చేసినట్లు మంత్రులకు వివరించారు. కొంత మంది రైతులు వారివారి బ్యాంకు అకౌంట్లను రద్దు చేసుకోవడం, మరి కొందరి ఖాతాలు వినియోగంలో లేకపోవడం వల్ల రుణమాఫీ డబ్బు జమ కాలేదన్నారు. రుణమాఫీ అయినందున రైతులకు కొత్త రుణాలు మంజూరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, డీఆర్‌డీఏ ఏపీడీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

బోనం.. వైభోగం

చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని బంగారు మైసమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. తమను చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఉత్సవాల్లో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, స్థానిక సర్పంచ్ అనిత తదితరులు పాల్గొన్నారు.

– కుల్కచర్ల



బోనాల ఊరేగింపులో భక్తజనం

‘గురునానక్’ వద్ద మళ్లీ ఉద్రిక్తత

- ఓరియంటేషన్‌కు అడ్డుపడిన విద్యార్థులు, పేరెంట్స్
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు



గురునానక్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ఇబ్రహీంపట్నం: గురునానక్ కళాశాల వద్ద మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు తీసుకొని తమ జీవితాలతో యాజమాన్యం చెలగాటమాడుతోందని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లీ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న యూనివర్సిటీలో ఎంసీఏ, బీసీఏ, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్, పారా మెడికల్, కార్డియాలజిస్ట్, ఫిజియోథెరపీ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన సుమారు వంద మంది విద్యార్థులు వారి పేరెంట్స్ అక్కడికి చేరుకున్నారు. ఓరియంటేషన్‌కు అడ్డుతగిలారు. తమకు న్యాయం చేయాలని, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలంటూ నినదించారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి పక్కకు తీసుకొచ్చారు. అనంతరం కోహ్లీతో విద్యార్థులు, వారి పేరెంట్స్ వాగ్వాదానికి దిగారు. తమ పిల్లల జీవితాలతో ఆటలాడొద్దని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అనుమతికి సంబంధించిన జీవో జారీ కానందున ప్రభుత్వం ఇతర కళాశాలకు విద్యార్థులను బదిలీ చేసిందని, దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని కోహ్లీ చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

మేస్త్రీ బలవన్మరణం


ఈదయ్య(ఫైల్)

పరిగి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. దోమ మండలం మైలారం గ్రామానికి చెందిన గజ్జెల ఈదయ్య(విజయ్)(45) భార్య యశోద, ఇద్దరు పిల్లలతో కలిసి పట్టణంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. మేస్త్రీ పని చేసే ఈదయ్య అనారోగ్యం కారణంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగి వచ్చి దూలానికి ఉరేసుకున్నాడు. పెద్ద కుమారుడు గమనించడంతో వెంటనే ఆయన్ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

లారీకింద పడి మృతి


అయ్యప్ప మృతదేహం

తాండూరు: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి లారీకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తాండూరు టౌన్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని మార్వాడి బజార్‌కు చెందిన పల్లెపోతు అయ్యప్ప(40)కు ఆరేళ్లుగా మానసిక స్థితి సరిగాలేదు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లోంచి బయటకు వచ్చారు. తాండూరు–చించోళి ప్రధాన రోడ్డు మీదుగా గౌతాపూర్ వైపు వెళ్తున్న లారీ వెనుక టైరు కిందకు దూరాడు. దీంతో ఆయన మీదుగా లారీ చక్రాలు పోవడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం వద్ద బాధితులు

కొడంగల్ రూరల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దనందిగామలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన షఫీ, రఫీ అన్నదమ్ములు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పశువులు మేత మేస్తున్న క్రమంలో ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రఫీ కోరాడు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

యువకుడి దుర్మరణం


వెంకటేశ్ మృతదేహం

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న ట్రాలీ ఎదురుగా వచ్చిన యాక్టివాను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏపీ. రంగా తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(21) కొంతకాలంగా మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్ నగర్‌లో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో వెంకటేశ్ యాక్టీవాపై నార్సింగి వైపు నుంచి అజీజ్‌నగర్‌కు వస్తుండగా గండిపేట చౌరస్తా సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంతో వచ్చిన ట్రాలీ ఆటో యాక్టీవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ తలకు తీవ్రగాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


అనంతగిరి: వికారాబాద్‌లో జలమయమైన రోడ్డు


అనంతగిరి: మద్గుల్‌చిట్టంపల్లి వాగు వద్ద స్తంభించిన రాకపోకలు


మోమిన్‌పేట: మొరంగపల్లి రైల్వే అండర్ పాస్ కింద వరదలో నిలిచిపోయిన బస్సు

ముంచెత్తిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- నిలిచిపోయిన రాకపోకలు
- ఇళ్లకే పరిమితమైన జనం

జిల్లా వ్యాప్తంగా భారీ వాన కురిసింది. శనివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం ఆదివారం కొనసాగింది. వాన దంచికొట్టడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వాగుల్లో వరద ఉధృతి పెరగడంతో పలుమార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో పల్లెలు, పట్టణాల్లో అంధకారం నెలకొంది. చెరువులు మత్తడి దుంకి అలుగులుపారాయి. పలుప్రాంతాల్లో పంటలు నేలకొరాయి. చేలల్లో నీరు నిలిచింది.

– సాక్షి, నెట్‌వర్క్


అనంతగిరి: రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వరద


దోమ: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


తాండూరు రూరల్: సంగెంకలాన్ శివారులోని పత్తి పంటలో నిలిచిన నీరు


ధారూరు: దోర్నాల్ అసంపూర్తి వంతెన వద్ద పోలీసుల గ


మోమిన్‌పేట: మొగులవంపు వాగు ఉధ్రుతికి నిలిచిపోయిన వాహనాలు


తాండూరు రూరల్: పొంగిపొర్లుతున్న బెల్కటూర్ వాగు


మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో అలుగు పారుతున్న గంగమ్మ వాగు


అనంతగిరి: ద్యాచారం వాగు ఉధ్రుతి


అనంతగిరి: పులుమద్ది రైల్వే గేట్ సమీపంలో చేరిన వరద


నవాబుపేట: గంగ్యాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ


నవాబుపేట: పంట పొలాల్లో నిలిచిన నీరు


పరిగి: అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్ట్

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే రైల్వేలైన్ ఆలస్యం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వికారాబాద్–కృష్ణ రైల్వే లైన్ ఆలస్యం అవుతోందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2011లో రూ.800కోట్ల బడ్జెట్‌తో వికారాబాద్–కృష్ణ రైల్వే లైన్ మంజూరు చేసిందన్నారు. తరువాత కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో పనులు పూర్తిగా ఆలస్యం అయిందన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రైల్వే లైన్ మంజూరు ప్రకటనలో కేంద్ర ప్రభుత్వంలో మంజూరైన లైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేయకపోవడంతో ఇంత ఆలస్యం అయిందని స్పష్టం చేశారన్నారు. అప్పట్లో రూ.800 కోట్ల బడ్జెట్ ఇప్పుడు రూ.2,200 కోట్ల బడ్జెట్ అంచన పెరిగిందన్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మంజూరైన రైల్వే లైన్ గురించి ఇప్పటికైనా కదలిక రావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికై ప్రభుత్వాలు ఆలసత్వం వహించకుండా రైల్వే లైన్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు వచ్చినా.. పంతులు రాలే!


ఉపాధ్యాయుడు విధులకు రాకపోవడంతో మూసి ఉన్న మొగిలిగుండ్ల పాఠశాల



వర్షం కారణంగా తెరుచుకోని మొగిలిగుండ్ల ఎంపీపీఎస్

మర్పల్లి: అకాల వర్షాల కారణంగా సోమవారం మొగిలిగుండ్ల ప్రాథమిక పాఠశాల తెరుచుకోలేదు. ఈ పాఠశాలలో 13 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వర్షంలోనూ విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. ఉదయం 11గంటల సమయం కావస్తున్నా పాఠశాల తాళం తీయకపోవడంతో విద్యార్థులు చేసేదేమీలేక వెనుదిరిగారు. విషయాన్ని పరిశీలించిన 'సాక్షి' ఎంఈఓ విద్యాసాగర్‌ను వివరణ కోరగా అక్కడ ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నాడు. ఆయన అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవ్వడంతో తప్పని పరిస్థితిలో సెలవు మంజూరు చేశామన్నారు. అప్పటికే 11గంటలు కావస్తుండడంతో మరో ఉపాధ్యాయుడిని పంపించలేకపోయమన్నారు.

చేతులు, కాళ్లు తాళ్లతో బిగించి.. చెరువులో పడేసి

- గోనెసంచిలో వేసి.. నడుముకు రాయికట్టి
- యువకుడి దారుణ హత్య


ప్రవీణ్(ఫైల్)

షాబాద్: చేతులు, కాళ్లు తాళ్లతో బిగించి.. గోనెసంచిలో వేసి.. నడుముకు రాయికట్టి చెరువులో పడేసి యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం మండల పరిధిలోని హైతాబాద్ చెరువులో ఓ గోనె సంచిలో మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. యువకుడి తలపై కొట్టి, కాళ్లు, చేతులు తాళ్లతో బిగించి, నడుముకు బండ రాయి కట్టి గోనెసంచిలో వేసి పడేసినట్లు గుర్తించారు. మృతుడిని మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన కుమ్మరి ప్రవీణ్(31)గా గుర్తించారు.

వివాహేతర సంబంధమే కారణమా..?

ప్రవీణ్‌కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమ గా మారింది. హత్యకు అక్రమ సంబంధమే కారణమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు కుమ్మరి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు కలేనా?

పదిహేనేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో నిస్తేజంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు, కుంటలకు మరమ్మతు చేసినా వాటిపై అజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతుపనులపై దృష్టి పెట్టే వారే కరువయ్యారు.

- నీటి సంఘాలకు 2006లో చివరి ఎలక్షన్
- పదిహేనేళ్లుగా కొలువుదీరని కొత్త పాలకవర్గాలు
- పట్టించుకోని ప్రభుత్వం


మినీట్యాంక్ బండ్‌గా మారనున్న దౌల్తాబాద్ పెద్ద చెరువు

దౌల్తాబాద్: చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్ని తీసుకువచ్చింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం తదితర పనుల పర్యవేక్షణ పనులు నీటి సంఘాల పాలవర్గాలు చేపట్టేవి. పదిహేనేళ్లుగా ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించకపోవడంతో చెరువుల పర్యవేక్షణ కరువైంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలను పునరద్ధరించింది. కానీ నీటి సంఘాల పాలకవర్గం లేకపోవడంతో పనులను పట్టించుకునే వారు లేరు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. పలు చోట్ల చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది చెరువులకు నీటి సంఘాలు

మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో 9 నోటిఫైడ్ చెరువులు, 50 వరకు కుంటలున్నాయి. ఇందులో కొన్ని చెరువులను ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులకు తొమ్మిది చెరువులకు నీటి సంఘాలున్నాయి. మండల కేంద్రంలోని పెద్ద చెరువును మినీట్యాక్‌బండ్‌గా మార్చేందుకు సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

రైతుల సమన్వయంతో పనులు

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టు రైతులు చెరువుకు చైర్మన్, డైరెక్టర్లును ఎన్నుకునేవారు. ఈ పాలకవర్గం సభ్యులు చెరువుల నిర్వాహణతో పాటుగా నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. వారు రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టేవారు

2008 నుంచి ఎన్నికలు బంద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2006 సంవత్సరంలో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008తో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు చేపట్టలేదు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వచ్చినా నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తడంలేదని రైతులు వాపోతున్నారు.

గోపాలకృష్ణకు సిల్వర్ మెడల్

అనంతగిరి: హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2నుంచి 4వరకు నిర్వహించిన 14వ జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్–2023, రెండవ భగవాన్ బిర్సాముండా ట్రోఫీ (కురుగి పూ మ్ సే) లో వికారాబా ద్‌కు చెందిన గోపాలకృష్ణ ఓవర్–40 పూమ్సే వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మూట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి అభినందించారు.

ఔటర్‌పై ఒకదాని వెనుక ఒకటి..

ఆరు కార్లు ఢీ

మణికొండ: ఓ వైపు వర్షం..కమ్ముకున్న కారు మబ్బులు.. ముందు వెళ్తున్న కార్లు సరిగా కనిపించకపోవటం..రహదారులపై నిలిచిన వరద నీటి కారణంగా.. ఓఆర్ఆర్‌పై వెళ్తున్న ఆరు కార్లు వెనక నుంచి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ సంఘటన నార్సింగి పీఎస్ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... సోమవారం మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా.. నార్సింగి కాకతీయ స్థూపం సమీపంలో రోడ్డు పై నీరు నిలిచి ఉండటంతో ముందుగా వెళ్తున్న ఓ కారు డ్రైవర్ అకస్మాత్తుగా వేగం తగ్గించాడు. దాంతో దాని వెనక వస్తున్న కారు దాన్ని ఢీ కొట్టింది. అదే తరహాల్లో మరో నాలుగు కార్లు వచ్చి ఢీ కొట్టాయి. కార్లలో ఉన్న వారికి ఎవరికీ గాయాలు కాకపోవటంతో వారంతా ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు. ప్రమాదానికి గురైన కార్లలో రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌కు చెందిన ఇన్నోవా కారు కూడా ఉంది. విషయం తెలుసుకున్న ఓఆర్ఆర్ సిబ్బంది వాటిని వెంటనే అక్కడి నుంచి పీఎస్‌కు తరలించారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యవిద్యకు ఐదుగురి ఎంపిక


విఘ్నేశ్


స్నేహిత్


విష్ణువర్ధన్


ఆకాశ్ రెడ్డి

కుల్కచర్ల: వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో మండల నుంచి ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించారు. అంతారం గ్రామానికి విఘ్నేశ్, ఆకాశ్ రెడ్డి, విష్ణువర్ధన్, చౌడాపూర్ గ్రామానికి చెందిన స్నేహిత్, గోగ్యానాయక్ తండాకు చెందిన సంజీవ్ ఎంపిక కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

కిసాన్‌మోర్చా సమ్మేళనానికి అంతా సిద్ధం


ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

- హాజరుకానున్న బీజేపీ ప్రముఖులు
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ క్లాం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగే కిసాన్ మోర్చా రాష్ట్రస్థాయి సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమ్మేళనానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చాహర్, తరుణ్ చుగ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్‌తో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వారి వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ నారాయణ యదవ్, అసెంబ్లీ కన్వీనర్ ఎన్ను యాదగిరిరెడ్డి, గీతా సెల్ కన్వీనర్ లక్ష్మీపతిగౌడ్, మీడియా సెల్ కన్వీనర్ అశోక్ తదితరులు ఉన్నారు.